## కథ

**కృష్ణ ఆత్మహత్య చేసుకున్నాడు. అందుకు అతను ఎంచుకున్న పద్ధతి కూడా అతని వృత్తికి అనుగుణంగానే వుంది. అతనొక ఎలక్ట్రీషియన్. ఆత్మహత్యకు కరెంట్‌నే ఉపయోగించుకున్నాడు.**

# హత్యా? ఆత్మహత్యా?

అతనికి చిన్న బజారులో షాప్ ఉంది. అక్కడ ఫ్యాన్‌లు, మోటార్‌లూ, గ్రైండర్‌లూ రిపేర్ చేస్తాడు. ఫంక్షన్‌లలో సీరియల్ సెట్స్, లైటింగ్ ఏర్పాటు చేస్తూ ఉంటాడు.

ఒక అర్ధరాత్రి తన షాప్‌లోని ప్లగ్ సాకెట్‌లో రెండు వైర్లు దూర్చాడు. ఆ రెండు వైర్ల కొనలూ ఒక రేకు కుర్చీ కాళ్ళకు తగిలించాడు. మధ్యలో ఒక వైర్‌కి 'దొండకాయ స్విచ్' అమర్చాడు. ఆ స్విచ్ నొక్కితే చాలు కుర్చీలోకి కరెంట్ ప్రవహించి దాని మీద కూర్చున్న వ్యక్తి మరణిస్తాడు.

కృష్ణ ఆ విధంగానే మరణించాడు.

ఆత్మహత్యకు కారణాలుగా అప్పుల బాధ, ప్రేమ వైఫల్యం అని చెప్పుకున్నారు జనం.

అతను ప్రేమించిన అమ్మాయికి ఆ మధ్య వేరే అబ్బాయితో పెళ్ళి నిశ్చయం అయింది. ఆమె అతనిని కలుసుకోవడం మానేసింది. అదీకాక ఆత్మహత్యకు ముందు రోజు అప్పులవాళ్ళు కృష్ణతో ఘర్షణ పడ్డారు- అని పోలీసులకు ఎవరో ఉప్పందించారు.

కృష్ణ ఆత్మహత్య చేసుకున్నాడని భావించిన పోలీసులు ఫైలు మూసేశారు.

★ ★ ★

''లేదు. నా కొడుకు ఆత్మహత్య చేసుకోలేదు. ఎవరో చంపేశారు. మాకు అప్పులున్న మాట నిజమే. క్రమంగా తీర్చుకొస్తున్నాం. ఎవరితోనూ ఘర్షణ పడలేదు. ప్రేమ వైఫల్యానికి కృష్ణ బాధపడ్డాడు గానీ కృంగిపోలేదు. మీరు హంతకుడిని పట్టుకోవాలి సార్'' ఆవేశంగా చెప్పాడు వీరభద్రం.

సీతానగరంలో న్యాయం కోసం మాత్రమే పనిచేసే సంస్థ 'చైతన్య విక్రమం' ఆ సంస్థలో చైతన్య-లాయర్. విక్రం-డిటెక్టివ్.

వాళ్ళిద్దరూ వీరభద్రం చెప్పిందంతా శ్రద్ధగా విన్నారు.

తన కొడుకు ఆత్మహత్య చేసుకున్నాడంటే చాలామంది నమ్మలేరు. అది హత్య అని అనుమానిస్తారు. వీరభద్రం కూడా అంతే-అనుకున్నాడు చైతన్య.

''శవానికున్న బట్టలు మా అబ్బాయివి కావు సార్'' అన్నాడు వీరభద్రం చివరకు.

ఒక్కసారిగా ఎలర్ట్ అయిన చైతన్య ఈ కేసుని విచారించిన యస్సై రాజుని కలవాలనుకున్నాడు.

రాజు విక్రంకి స్నేహితుడే. సర్వీస్‌కి కొత్త కావడంతో అప్పుడప్పుడు విక్రంని సంప్రదిస్తూ ఉంటాడు. క్లేర్ వాయన్స్ కేసులో చైతన్య, విక్రంలు చేసిన సాయం వల్లనే అసలు నేరస్తుడు పట్టుబడడంతో రాజుకి పేరొచ్చింది.

ఇప్పుడు చైతన్య, విక్రంలు స్టేషన్‌కు రావడంతో సాదరంగా ఆహ్వానించాడు రాజు.

కృష్ణ ఆత్మహత్య గురించి వివరాలు అడిగాడు చైతన్య.

పోలీసులు తీసిన ఫొటోలు, పోలిథిన్ కవరులో 'దొండకాయ స్విచ్'తో బాటు వుంచిన వైరులు, పోస్ట్‌మార్టం రిపోర్ట్ చూపించి వివరాలు చెప్పాడు రాజు.

రిపోర్ట్ చదువుకొని, వైరులు చూసి, ఫొటోలను నిశితంగా పరిశీలిస్తూ ఉండిపోయాడు చైతన్య. ఆ ఫొటోల్లో అంత నిశితంగా చూడడానికేం ఉందో అర్థం కాలేదు రాజుకి.

''కృష్ణ ఆత్మహత్య చేసుకోలేదంటారా?'' అనుమానంగా అడిగాడు చివరకు.

''కృష్ణ తండ్రి వీరభద్రం చెప్పినప్పుడు నేను పట్టించుకోలేదు. కానీ ఈ ఫొటోలు చూస్తోంటే..'' ఆగిపోయాడు చైతన్య.

అనుమానించడానికేముంది అన్నట్లు చూశాడు రాజు.

పోలిథిన్ కవరులోని వైరులతో వున్న స్విచ్‌ని చూపిస్తూ ''దాని మీద కృష్ణ వేలి ముద్రలున్నాయా?'' అడిగాడు చైతన్య. మౌనమే రాజు సమాధానం!

నిజానికతడు శవాన్ని, ఆ వైర్‌లను చూస్తూనే ఆత్మహత్యగా నిర్ణయించుకొని విధాయకంగా జరపవలసిన పరీక్షలేవీ జరపకుండానే ఫైలు మూసేశాడు.

''ఆ స్విచ్ ఆన్‌లో వుందా? లేదా? కనీసం ఆ విషయం అయినా పరీక్షించారా?'' మృదువుగానే అడిగాడు చైతన్య.

రాజు తల వాలిపోయింది. ఆ విషయం పరీక్షించాలనిపించలేదతనికి.

మామూలుగా ఇళ్ళల్లో స్విచ్‌బోర్డు కుండే స్విచ్‌ని చూడగానే అది ఆన్‌లో ఉందా లేదా చెప్పగలం. కానీ 'దొండకాయ స్విచ్' విషయం అలా కాదు. దాన్ని చేతి వేళ్ళ మధ్య బిగించి పట్టుకొని బొటనవేలితో బటన్ నొక్కితే ఆన్ అవుతుంది. ఇంకోసారి నొక్కితే ఆఫ్ అవుతుంది.

ఆ స్విచ్‌ని విప్పి చూస్తేగాని అది ఆన్‌లో ఉందో, లేదో తెలియదు.

''కనీసం ఇప్పుడైనా చూడండి'' అన్నాడు చైతన్య.

రాజు స్విచ్ విప్పి చూశాడు. ఆశ్చర్యం! ఆ స్విచ్ ఆన్‌లో లేదు! అంటే..దాని గుండా కరెంట్ ప్రవహించలేదు! అంటే..అంటే..

షాక్ అయినట్లు ఉండిపోయాడు రాజు. కామెంట్ చేసి అతని మనసు గాయపరచడం యిష్టం లేక చైతన్య మౌనం వహించాడు.

మిత్రుడే గనక రాజుతో సంభాషణ కొనసాగించాడు విక్రం. తను కూడా ఫొటోలు పరిశీలిస్తూ ''ఆత్మహత్య విషయం నీకెవరు చెప్పారు?'' అడిగాడు.

''తెల్లవారకుండానే పనిమనిషి వచ్చి షాపు అరుగులు, మెట్లు కడిగి, ముగ్గుపెట్టి వెళ్ళిపోతుంది. ఆరోజు పనిమనిషి వెళ్ళేటప్పటికి షాపునకు తాళం కప్ప లేదు. తలుపు నెట్టి చూడగా శవం కనిపించడంతో అరిచి, నలుగురినీ పిలిచి చూపించింది. వాళ్ళలో ఒకడు పోలీస్‌స్టేషన్‌కు ఫోన్ చేసి మా యింటి ఫోన్ నంబర్ తెలుసుకొని నాకు ఫోన్ చేశాడు''

''ఏమని చెప్పాడు?''

''కృష్ణ ఆత్మహత్య చేసుకున్నాడని''

''నువ్వు షాప్‌కి వెళ్ళినప్పుడు ఫోన్ చేసినవాడు కనిపించాడా?''

''కనిపించాడు. అతనితో బాటు అక్కడున్న నలుగురూ కృష్ణ అప్పుల గురించి, ప్రేమ వైఫల్యం గురించీ వివరించి అతడు ఆత్మహత్య చేసుకున్నాడని చెప్పారు''

''వాళ్ళ పేరులూ, అడ్రస్‌లూ తీసుకున్నావా?''

తను చాలా ఘోరమైన తప్పిదం చేసినట్టు అప్పుడనిపించింది రాజుకు. అతను వాళ్ళ అడ్రస్‌లు తీసుకోలేదు.

''ఆత్మహత్య అని వాళ్ళు చెప్పారు. నువ్వు నమ్మేశావ్! అంతేనా?''

రాజు తల మళ్ళీ వాలిపోయింది. అప్పటికి ఫొటోల పరిశీలన పూర్తయి- ''కరెంట్ షాక్ రెండు రకాలు. ఒకటి దూరంగా విసిరికొడుతుంది. రెండోది దగ్గరగా లాక్కుంటుంది. శవం పొజిషన్ ఈ ఫొటోలో చూడు. ఫ్లోర్ నుంచి కుర్చీ మీదకు కర్రను చేరవేసినట్లుంది'' అన్నాడు విక్రం.

''మరి ఎలా ఉండాలి?'' రాజు సందేహం.

''మనిషిని విసిరేసే షాక్ అయితే శవం కిందపడి ఉండాలి. కుర్చీ కూడా అస్త వ్యస్తంగా పడి ఉండాలి. రెండో రకం షాక్ అయితే కుర్చీలో కూర్చున్నవాడు కూర్చున్నట్టే చనిపోయి ఉండాలి. కాని యిలా కర్ర చేరవేసినట్లుగా కాదు''

ఆ ఆలోచన తనకెందుకు కలగలేదా అని చింతించాడు రాజు.

''అంతేకాదు. ఈ ఫోటోలో కృష్ణ ముఖం చూడు..కళ్ళు పెద్దవై ముందుకు పొడుచుకొచ్చాయి. ముఖం మీద నరాలు ఉబ్బి ఉన్నాయి. కళ్ళలో ఏదో దిగ్భ్రాంతి. ఏదో భయం. అనుకోని సంఘటన జరిగినట్లు ఏదో విహ్వలత కనిపిస్తున్నాయి. ఆత్మహత్యకు నిర్ణయించుకున్న వాడిలో తెగింపు కనిపించాలి. దిగ్భ్రాంతి, భయం..కాదు''

''అయితే ఎవరో, ఎక్కడో కృష్ణని హత్యచేసి శవాన్ని అతని షాపులో అలా ఉంచారంటావా?'' అనుమానంగా అడిగాడు రాజు. ఆ ప్రశ్నకు జవాబు చెప్పకుండా.

''ఈ ఫోటోచూడు! శవానికున్న బట్టలు ఒక సైజు పెద్దవిగా లేవూ?'' అన్నాడు.


''దానికేంలే! ఫ్యాషన్‌లు అలా మారిపోతున్నాయి. కొంతకాలం బిగుతు బట్టలు. మరికొంతకాలం డబ్బా డ్రెస్‌లు. ఫ్యాంట్ నిండా జేబులూ, మాసికలూ, షర్ట్‌ల మీద నానా చెత్త బొమ్మలూ, రాతలూ..మరికొంత కాలం చింకి బట్టలు..''

''అతని దుస్తులు తీసి భద్రపరిచారా?'' హఠాత్తుగా అడిగాడు చైతన్య.

బీరువా తెరిచి దుస్తులు ఉంచిన సంచి తెరిచి చూపించాడు రాజు.

ప్రఖ్యాత కంపెనీకి చెందిన రెడీమేడ్ దుస్తులవి.

''కృష్ణ వాళ్ళింటికెళ్ళి అతని దుస్తులు ఎలా ఉంటాయో చూశారా?''



రాజుకి అలాంటి ఆలోచనే రాలేదు. ఆ దుస్తులు మా అబ్బాయివి కావని వీరభద్రం చెప్పినా తను పట్టించుకోలేదు.

చైతన్య చెప్పగా, రాజు, విక్రంలు-వీరభద్రం యింటికెళ్ళి కృష్ణదుస్తులు పరిశీలించారు. ప్లాట్‌ఫాం టైలర్ కుట్టిన చవకబారు బట్టలు అవన్నీ. కృష్ణకి అసలు రెడీమేడ్ బట్టలు లేనే లేవని వీరభద్రం చెప్పాడు.

ప్రఫుల్లచంద్ర

తర్వాత వీరభద్రం కుటుంబానికి అప్పులిచ్చిన వాళ్ళని కలిశారు రాజు, విక్రం.

వాళ్ళంతా కృష్ణ చాలా మంచివాడని, క్రమం తప్పకుండా అప్పులు కొంచెం కొంచెంగా తీర్చుతున్నాడనీ, ఎవరూ అతనితో ఘర్షణ పడలేదనీ చెప్పారు.

అడుగు ముందుగు సాగుతున్నకొద్దీ ఇది ఆత్మహత్యకాదు, హత్య!- అన్న అనుమానం బలపడుతూనే వుంది రాజు హృదయంలో. తను ఎంత అనాలోచితంగా ఒక నిర్ణయానికొచ్చేసి ఫైలు మూసేశాడో తలచుకొని సిగ్గుపడ్డాడు. చైతన్య, విక్రంలాంటి వారితో కలిసి పనిచేయడమే ఒక

ఎడ్యుకేషన్ అనిపించిందతనికి.

ఇద్దరూ చైతన్యని కలిసి తాము సేకరించిన విషయాలు వివరించారు.

''ఇంకొక్క విషయం నిర్ధారించుకుంటే మన పరిశోధన ముగిసినట్టే'' అన్నాడు చైతన్య.

★ ★ ★

పోస్ట్‌మార్టం చేసే డాక్టర్లు కొందరు కేసు ప్రాముఖ్యతను బట్టి ప్రతిస్పందిస్తారు. వ్యవహారం కోర్టు వరకు వెళ్తుందనిపిస్తే శ్రద్ధగా అన్ని వివరాలూ రాస్తారు రిపోర్ట్‌లో. లేకుంటే ఆషామాషీగా రాసి పారేస్తారు.

పెద్దగా వివరాల జోలికి పోకుండా కరెంట్ షాక్ వల్ల కృష్ణ చనిపోయినట్టు రిపోర్ట్ రాశాడు డాక్టర్.

## సౌందర్యాభిలాష

**పెళ్లి జీవితానికి పరిపూర్ణత్వాన్ని ఇస్తుందంటారు. గోల్డీబెహల్‌ని పెళ్లాడిన సోనాలీని చూస్తే అది నిజమేనేమో అన్పిస్తుంది. గోల్డీ ఎక్కడికెళ్లినా ఈ-మెయిల్‌లో ఇద్దరూ పలకరించుకుంటున్నారట. భర్త రాకకోసం ఆమె వేయికళ్లతో ఎదురుచూస్తూ భర్తచాటు భార్యగా మారిపోయింది. ఇప్పుడు అందంగా తయారుకావడానికే ప్రాధాన్యత ఇస్తోంది. 'నాకళ్లే నాకందం' అని చెప్పే సోనాలీ ఇప్పుడు నేత్ర సౌందర్యాన్ని పెంచుకునే పనిలో పడిందిట. భర్తని మెప్పించాలంటే ఆ మాత్రం కష్టపడక తప్పదు మరి!**



''ఇప్పుడు వివరాలు చెప్పండి డాక్టర్!'' అడిగాడు చైతన్య.

కుర్చీలో ఇబ్బందిగా కదిలాడు డాక్టర్.

''కృష్ణ శరీరం మీద గాయాలున్నాయా?''

''వీపుమీద చుట్టతో చురక పెట్టిన మాదిరి గాయం ఉంది''

''అది నిజంగా చుట్ట చురకేనా?''

''కాదు. చాలా పవర్‌ఫుల్‌గా కాలిన గాయం. ఆ పవర్‌కి గాయం చుట్టూ కొంతమేర చర్మం నిర్జీవం అయింది''

కళ్ళు మూసుకొని కాసేపు ఆలోచించాడు చైతన్య.

''హైపవర్ కరెంట్ ప్రవహిస్తున్న కేబుల్ కొన తాకడం వల్ల ఆ గాయం అయి ఉంటుందా?''

''కరెక్ట్! నా అభిప్రాయం అదే''

★ ★ ★

ముగ్గురూ చైతన్య విక్రమం ఆఫీసులో కూర్చున్నారు.

కళ్ళు మూసుకొని సుదీర్ఘంగా ఆలోచించిన చైతన్య చివరకు కళ్ళు తెరిచాడు.

ఫోటోలో కృష్ణముఖం చూశాక సినిమా హాళ్ళు, ఫ్యాక్టరీలలో ఉండే మాదిరి హైపవర్ కరెంట్ వల్ల మరణం సంభవించి ఉంటుందని చైతన్య అనుమానం.

ఆ అనుమానం నిజమే అని డాక్టర్ వల్ల రూఢి అయింది.

ఏదో రిపేర్ కోసమని కృష్ణని ఎవరో ఫ్యాక్టరీకి గాని సినిమా హాలుకి గాని తీసుకెళ్ళి ఉంటారు జనం లేని సమయంలో.

నీళ్ళలో కరెంట్ చురుకుగా శక్తివంతంగా పనిచేస్తుంది.

వెనకనుంచి ఎవరో అతని మీదకు నీళ్ళు జల్లడం, ఇంకొకరు- కరెంట్ ప్రవహిస్తున్న కేబుల్ కొన అతనికి అంటించడం వెంట వెంటనే జరిగి ఉంటాయి. హఠాత్తుగా ఈ విషయం గమనంలోకి రావడం వల్లనే కృష్ణముఖంలో ఆ భయ విహ్వలత నిలిచిపోయింది.

అతడు కిందపడి విలవిల తన్నుకోవడం వల్ల బట్టలు పాడయి ఉంటాయి.

అదీకాక కేబుల్ కొన తాకిన చోట షర్ట్ కాలిపోయి ఉంటుంది. చూసేవాళ్ళకి అనుమానం కలగకుండా ఆ బట్టలు తొలగించి వేరే దుస్తులు తొడిగారు.

ఆ ప్రాంగణంలోనే శవాన్ని దాచిపెట్టి అర్ధరాత్రి దాన్ని అతని షాపునకు తరలించి ఆత్మహత్యలాగా కనిపించేటట్టు ఏర్పాటు చేశారు.

మరణించిన ఎనిమిది గంటలకు శరీరం కొయ్య బారిపోతుంది. అందుకే కుర్చీలో కూర్చోబెట్టడం కుదరలేదు. చేరబెట్టారు-

ఈ విషయాలన్నీ చైతన్య చెబుతోంటే విభ్రాంతిగా వింటూ ఉండిపోయాడు రాజు.

అతని భుజం తట్టి ''నేర పరిశోధనలో మనం ముందుగానే ఒక అభిప్రాయానికొచ్చేసి ఆ అభిప్రాయాన్ని బలపరిచే సాక్షులతోనే సంతృప్తి చెందకూడదు. అన్ని కోణాల్లోనూ ఆలోచించాలి.

కృష్ణ ఆత్మహత్య గురించి ఫోన్ చేసినవాడు, షాపు వద్ద నీకు కనిపించి అప్పులబాధ, ప్రేమ వైఫల్యం గురించి చెప్పి ఆత్మహత్య అని నీలో అభిప్రాయం కలిగించినవాళ్ళు ఆ హంతకుని మనుషులే అయి వుంటారు'' అన్నాడు విక్రం.

ఇదంతా ఒక పాఠం లాగా వుంది రాజుకి.

''ఇంతకూ హంతకుడెవరని మీ ఉద్దేశం?'' చైతన్యవైపు తిరిగి ఆరాధన నిండిన స్వరంతో అడిగాడు రాజు.

''ఇప్పటికిప్పుడే నిర్ధారణగా చెప్పలేనుగాని పరిశోధన ఏ దిశలో సాగాలో సూచిస్తాను.

హైటెన్షన్ కరెంట్ ఉపయోగించే సంస్థలో హత్య జరిగి ఉండాలని చెప్పాను కదా.

హత్య చేసే మోటివ్ ముగ్గురికే వుంది. కృష్ణ ప్రేమించిన అమ్మాయి తండ్రి, ఆమె కాబోయే భర్త, కాబోయే మామగారు. వీరిలో ఫ్యాక్టరీ, సినిమాహాలు లాంటివి ఎవరికున్నాయో ఆరాతీస్తే క్లూ దొరకవచ్చు.

బహుశా కాబోయే పెళ్ళికొడుకు ఆ ప్రముఖ కంపెనీ రెడీమేడ్ దుస్తుల్నే వాడుతూ ఉండొచ్చు!'' అని గుంభనంగా నవ్వాడు చైతన్య!

✤